TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 68 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.01.10.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




## జెడ్పీటీసీ అభ్యర్థుల ప్రతిపాదనలు సిద్ధం చేయండి



హైదరాబాద్ అమృత్ తెలంగాణ: స్థానిక సంస్థల అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. ఒక్కో మండలం నుంచి ముగ్గురు పేర్లతో కూడిన ప్రతిపాదిత అభ్యర్థుల జాబితాను ఐదో తేదీ నాటికి రాష్ట్ర కేంద్రానికి పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మంత్రులతో జూమ్ మీటింగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ నిర్వహించారు. ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర ముఖ్యనాయకులతో సంప్రదించి ప్రతి జెడ్పీటీసీ స్థానం నుంచి ముగ్గురు అర్హులైన అభ్యర్థుల పేర్లను ప్రతిపాదించాలని సీఎం సూచించారు. అన్ని రకాలుగా అర్హులైన అభ్యర్థులను పీసీసీ ఎంపిక చేస్తుందనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ చిన్నపొరపాటు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గెలుపే లక్ష్యంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పనిచేయాలని సూచించారు.

మంత్రి పొన్నం ఇంట్లో కాంగ్రెస్ బీసీ నేతల భేటీ

హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ ముఖ్య నేతలు భేటీ అయ్యారు. అందులో పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, సీనియర్ నాయకులు వీహెచ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆదిశ్రీనివాస్, బీర్ల ఐలయ్య, అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానంగా చర్చించారు. న్యాయపరమైన అంశాల్లో రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై సమాలోచనలు జరిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులు మూడు నెలలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసుకోవచ్చునని తమిళనాడు విషయంలో కోర్టు తీర్పు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు.

## 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉన్నామనీ, కేంద్రం తగిన సహకారం ఇవ్వాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆహారం, ప్రజాపంపిణీ, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాశారు. రికార్డుస్థాయిలో సేకరణ లక్ష్యాలకు అనుగుణంగా డెలివరీ నిబంధన లు సడలించాలని, అదనపు నిల్వ, రవాణా సౌకర్యాలను కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 45–50 లక్షల మెట్రిక్ టన్నుల సన్నటి వరి, 30–35 లక్షల మెట్రిక్ టన్నుల ముతక ధాన్యం సేకరించనున్నట్టు ఆయన వెల్లడించారు. క్వింటాలు ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,389 నిర్ణయం మేరకు 80 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు దాదాపు రూ.20 వేల కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు. బోనస్ చెల్లింపులు, రవాణాతో కలిసి ఖర్చు రూ.24 వేల నుంచి రూ.26 వేల కోట్ల మధ్య పెరుగుతుందని వివరించారు.

కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును ఈ ఏడాది నవంబర్ 12 వరకు పొడిగిస్తూ, పార్బాయిల్డ్ రైస్‌గా మాత్రమే సరఫరాను తప్పనిసరి చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ముడి బియ్యం మార్పిడికి ఖరీఫ్ వరి మరింత అనుకూలంగా ఉంటుందనీ. అందుబాటులో ఉన్న స్టాక్‌లో, 7.80 లక్షల మెట్రిక్ టన్నులు ముడి బియ్యం మిల్లర్ల వద్ద ఉన్నాయి. అయితే 1.67 లక్షల మెట్రిక్ టన్నుల వరి (1.13 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి సమానం) బాయిల్డ్ రైస్ మిల్లర్ల వద్ద ఉంది. లభ్యతను బట్టి ముడి, బాయిల్డ్ రైస్ రెండింటినీ డెలివరీ చేయడానికి అనుమతివ్వాలనీ, బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని రబీ సీజన్‌కు మార్చాలని ఉత్తమ్ కోరారు.

సెప్టెంబర్ చివరి నాటికి ఖరీఫ్ 2024–25 నుంచి 5.44 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్, రబీ 2024–25 నుండి 14.92 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పంపిణీ చేయలేదని ఆయన పేర్కొన్నారు. దీని ఫలితంగా మిల్లర్లు కార్యకలాపాలను నిలిపివేయగా, పని లేకపోవడంతో కార్మికులు రైస్ మిల్లులను వదిలి వెళ్ళాల్సి వచ్చిందని చెప్పారు.

రాష్ట్రంలోని ఎఫ్‌సీఐల నిల్వ సామర్థ్యం 22.61 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, 21.72 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే నిండి ఉన్నాయని, కేవలం 0.89 లక్షల మెట్రిక్ టన్నులకు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ఉత్తమ్ తెలిపారు. నెలకు కనీసం 300 ప్రత్యేక రేక్‌లను (రైళ్లు) ఇవ్వాలని ఆయన సూచిం చారు. అదనపు నిల్వ స్థలాన్ని లీజుకు ఇవ్వమని మేము ఎఫ్‌సీఐ కోరారు. 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (53.73 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానం) సేకరణకు ఆమోదం తెలిపారనీ, మరో 10 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కోరారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమైన 53.60 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని, లేకుంటే లక్షలాది మంది రైతులు ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారని మంత్రి ఉత్తమ్ ఆందోళన వ్యక్తం చేశారు. గత రబీ సీజన్‌లో తెలంగాణ 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించగా, కేంద్రం 53 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే ఆమోదించిందని ఉత్తమ్ గుర్తుచేశారు. ఇప్పటికే సేకరించిన రబీ పంట నుండి మరో 10 లక్షల మెట్రిక్ టన్నులు తీసుకోవాలనీ, సేకరణ గడువును అక్టోబర్ 31 నుంచి 2026 జనవరి 31 వరకు పొడిగించాలని కోరారు.

## లండన్‌లో గాంధీ విగ్రహం ధ్వంసం.. తీవ్రంగా ఖండించిన భారత హైకమిషన్



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని లండన్‌లోని భారత హై కమిషన్ తీవ్రంగా ఖండించింది. లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్‌లో ఉన్న గాంధీ స్మారక విగ్రహాన్ని సోమవారం కొందరు దుండగులు ధ్వంసం చేశారు. కూర్చున్న భంగిమలో ఉన్న గాంధీ విగ్రహం స్తంభంపై పిచ్చిరాతలు రాశారు. ఈ చర్యను సిగ్గుచేటుగా భారత హైకమిషన్ పేర్కొంది. తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్మారక చిహ్న గౌరవాన్ని పునరుద్ధరించేందుకు యత్నిస్తున్నామని, ఈ అపవిత్రతపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఈ సిగ్గుచేటు చర్యను ఖండిస్తున్నామని, తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని లండన్‌లోని భారత హైకమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ అహింసా దినోత్సవానికి మూడు రోజుల ముందు జరిగిన ఈ ఘటన కేవలం విధ్వంసం మాత్రమే కాదని, అహింస భావనపై, మహాత్ముని వారసత్వంపై జరిగిన హింసాత్మక దాడిగా పేర్కొంది. లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్‌లోని ఈ స్మారకచిహ్నం వద్ద అక్టోబర్ 2న ప్రతి ఏడాది ప్రజలు నివాళులు అర్పిస్తుంటారు. విధ్వంసానికి సంబంధించిన నివేదికలను పరిశీలిస్తున్నామని మెట్రోపాలిటన్ పోలీసులు మరియు స్థానిక కామ్డెన్ కౌన్సిల్ అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ 'బాకీ కార్డు ను విడుదల చేసిన హరీశ్‌రావు



సిద్దిపేట: అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఏ పల్లెకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయని.. రోడ్లు వేయకుండా ఫ్యూచర్‌సిటీకి ఆరులేన్ల రహదారికి శంకుస్థాపన చేయటం విడ్డూరంగా ఉందని మాజీమంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు టాటా చెప్పిన రేవంత్‌రెడ్డి విలువైన భూములను విక్రయిస్తూ లంకె బిందెల వేట సాగిస్తున్నారని విమర్శించారు. మార్పు.. మార్పు అంటూ రాష్ట్ర ప్రజలను ఏమార్చారని మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ 'బాకీ కార్డు%–%ను విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలవుతున్నా ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. మాటిమాటికీ మహిళలను కోటీశ్వరులను చేస్తానంటూ మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతిలో మోసపోని వర్గమంటూ లేదని విమర్శించారు. తెలంగాణలో ఆరుగ్యారంటీలు అమలు చేస్తున్నామంటూ బిహార్ ప్రజలను కూడా రాహుల్‌గాంధీ మోసం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతీరైతుకు రూ.75 వేలు, ప్రతీ మహిళకు రూ.44 వేలు కాంగ్రెస్ బాకీ పడిందన్నారు.

అధికారంలోకి వచ్చి 22 నెలలువుతున్నా ఒక్క హామీని నెరవేర్చలేదని, అదే విషయాన్ని కాంగ్రెస్ బాకీ కార్డు రూపంలో ఎండగడతామన్నారు. రానున్న రోజుల్లో ఈ బాకీ కార్డే కాంగ్రెస్ పార్టీకి ఉరితాడు కాబోతుందన్నారు. ఇందుకోసం భారాస నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని, పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ప్రతీఇంటికీ ఈ కార్డును అందజేసి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను వివరించాలన్నారు. కార్డుపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లడగటానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. ఒక్కొక్కరికీ ఎంత బాకీ పడ్డారో ఇచ్చాకే కాంగ్రెస్ నాయకులు ఓట్లడగాలన్నారు.

## భయపెట్టే రాజకీయాల్ని ఆపండి : రాహుల్ గాంధీ



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: లడఖ్ ప్రజలతో చర్చలు జరపాలని కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ మంగళవారం కేంద్రాన్ని కోరారు. ఈ సందర్భంగా హింసను ప్రేరేపించే, భయపెట్టే రాజకీయాలను ఆపమని కేంద్రాన్ని రాహుల్ కోరారు. లడఖ్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై నిష్పక్షపాత న్యాయవిచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. మరణించిన వారిలో సైనికుల కుటుంబానికి చెందిన వారు కూడా ఉన్నారని రాహుల్ ఎత్తిచూపారు.

'తండ్రి సైనికుడు. కొడుకు కూడా సైనికుడే. వారి రక్తంలో దేశభక్తి ప్రవహిస్తోంది. అయినప్పటికీ లడఖ్ కోసం, అతని హక్కుల కోసం నిలబడినందుకు బిజెపి ప్రభుత్వం ధైర్యవంతుడైన కొడుకుని కాల్చి చంపింది. ఆ తండ్రి కళ్లు కన్నీరుకారుస్తూ ఒకే ఒక ప్రశ్నను అడుగుతున్నాయి. దేశానికి సేవ చేసినందుకు ఈరోజు దక్కిన ప్రతిఫలం ఇదేనా?అని.. లఖడలో బిజెపి చేసిన ఈ హత్యలపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాము. దోషులకు కఠినమైన శిక్ష విధించాలి. మోడీజీ మీరు లడఖ్ ప్రజలను మోసం చేశారు. లడఖ్ ప్రజలు తమ హక్కుల కోసం డిమాండ్ చేస్తున్నారు. మీరు ఇప్పటికైనా హింసను, భయపెట్టే రాజకీయాలను ఆపండి' రాహుల్ తన ఎక్స పోస్టులో పేర్కొన్నారు.

## కరూర్ తొక్కిసలాట తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేసిన విజయ్



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ కరూర్ లో జరిగిన తొక్కిసలాట ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఈ సంఘటన తనను ఎంతగానో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ ఘటనతో తన గుండె బద్దలైందని, మాటలు రావడంలేదని అన్నారు. తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక భావోద్వేగ వీడియో విడుదల చేశారు. కరూర్ ఘటనపై ఆయన మాట్లాడుతూ, "నా జీవితంలో ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదు. ఈ దురదృష్టకర ఘటన జరిగి ఉండాల్సింది కాదు. నేను కూడా మనిషినే%ౌ% అంతమంది చనిపోయారని తెలిస్తే అక్కడ్నించి వెళ్లిపోతానా?" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు, విమర్శల పట్ల విచారం వ్యక్తం చేశారు. "నన్ను టార్గెట్ చేసుకోండి కానీ, నా ప్రజలను కాదు సీఎం స్టాలిన్ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటే నన్ను ఏమైనా చేసుకోండి" అంటూ భావోద్వేగంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. తాను భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తానని, త్వరలోనే తాను స్వయంగా బాధితులను కలిసి పరామర్శిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన అసలు నిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని, న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## జూబ్లీహిల్స్ తుది ఓటరు జాబితా విడుదల..

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: జూబ్లీహిల్స్ తుది ఓటరు జాబితాను మంగళవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, 19 వ సర్కిల్ డీసీ జీ.రజనీకాంత్ రెడ్డి విడుదల చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో ఏఈఆర్ఓలు ఏసీపీ ప్రసీద, ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్, తహశీల్దార్ ప్రేమ్ కుమార్‌తో కలిసి స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా సిద్ధం చేసిన ఫొటో ఓటరు జాబితాను అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పి.వినోద్ కుమార్, బీజేపీ నుంచి సుప్రియ గౌడ్, సీపీఐ(ఎం) నుంచి టి.శేషగిరిరావు, ఎంఐఎం నుంచి నసీర్, టీడీపీ నుంచి ఎన్.బాల్‌రాజ్, కాంగ్రెస్ నుంచి జి.దేవేందర్, బీఎస్పీ నుంచి ఎ.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# భైంసా మండలం జెడ్పీటీసీ ఎన్నికలు:..... ఉద్యమకారుడు చాకేటి లస్మన్నపై అందరి దృష్టి

నిర్మల్ జిల్లా భైంసా, సెప్టెంబర్ 30, అమృత్ తెలంగాణ తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ వాతావరణం రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. ముఖ్యంగా భైంసా మండలం జెడ్పీటీసీ (జిల్లా పరిషత్ టెరిటోరియల్ కాన్స్టిట్యూయెన్సీ) స్థానానికి ఎస్సీ (షెడ్యూల్డ్ క్యాస్ట్) సామాజిక వర్గానికి రిజర్వేషన్ రావటంతో, మండల ప్రజలు మరియు వివిధ రాజకీయ పార్టీల దృష్టి ఒకే వ్యక్తిపై కేంద్రీకృతమైంది. ఆయనే తెలంగాణ ఉద్యమకారుడు చాకేటి లస్మన్న. భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామ నివాసి అయిన లస్మన్న, దాదాపు 20 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో చురుగ్గా పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన, ఇప్పుడు రాజకీయ రంగంలో మరింత బలంగా అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఉద్యమ నేపథ్యం మరియు పోరాటాలు

చాకేటి లస్మన్న నియోజకవర్గంలోని అనేక పాఠశాలలు మరియు కళాశాలల్లో అధ్యాపకుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత, తెరాస (తెలంగాణ రాష్ట్ర సమితి) ప్రభుత్వం రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. ఆయన ఉద్యమాలు కేవలం రాజకీయంగానే కాకుండా, సామాజిక సమస్యలపై కూడా దృష్టి సారించాయి. ఆర్టీసీ (రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్) కార్మికులు, ఆశా (అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్) కార్యకర్తలు, డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిర్వహించిన పోరాటాలు ఆయనను ప్రజలకు దగ్గర చేశాయి.

గత ఎన్నికల్లో, పవార్ రామారావు పటేల్‌ను ఎమ్మెల్యేగా చూడాలనే లక్ష్యంతో గ్రామగ్రామానా తిరిగి ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఆయన ప్రజలతో మమేకమై, వారి సమస్యలను అర్థం చేసుకున్నారు. ఇప్పుడు జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా, ఆయనపై అందరి దృష్టి నెలకొంది.

బీజేపీ టికెట్‌పై ఆశలు

భైంసా మండలం జెడ్పీటీసీ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ రావటంతో, చాకేటి లస్మన్నను బీజేపీ (భారతీయ జనతా పార్టీ) అభ్యర్థిగా ప్రకటించాలని మండల దళిత బహుజన సంఘాలు కోరుతున్నాయి. ఆయనకు టికెట్ ఇస్తే, దళిత బహుజనుల ఓటు బ్యాంక్, హిందూ వాహిని మద్దతు మరియు బీజేపీ స్వంత ఓటు బ్యాంకు కలిసి వచ్చి విజయం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. దళిత బహుజన నాయకుడిగా ఆయనకు ఉన్న గుర్తింపు, ఈ సమీకరణలను మరింత బలపరుస్తుంది.

విద్యా మరియు సామాజిక నేపథ్యం

చాకేటి లస్మన్న విద్యా రంగంలో కూడా తన ముద్ర వేశారు. భైంసా సుభద్రవాటిక మరియు కిసాన్ గల్లి శిశుమందిర్ పాఠశాలల్లో దాదాపు 4 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఈ కాలంలో హిందూ ధర్మం గురించి లోతైన అవగాహన పెంచుకున్నారు. ఆయన ఉద్యమాలు మరియు విద్యా సేవలు, ఆయనను సామాజిక సంస్కర్తగా గుర్తించేలా చేశాయి.

మొత్తంగా, చాకేటి లస్మన్న వంటి ఉద్యమకారులు రాజకీయంలోకి రావటం వల్ల ప్రజల సమస్యలు మరింత సమర్థవంతంగా పరిష్కారమవుతాయని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

బీజేపీ ఆయనకు టికెట్ ఇవ్వటం ద్వారా, దళిత బహుజన సమాజానికి న్యాయం జరుగుతుందని వారు విశ్వసిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఈ అంశం మరింత చర్చనీయాంశంగా మారింది.

# గ్రూప్-1లో ఎంపీడీవోగా విజయం సాధించిన తుడుం లవకుమార్, పాటిల్ జ్యోత్స్న



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఉట్నూరు మండలం కొత్తగూడ ప్రాంతానికి చెందిన తుడుం లవకుమార్ , బజార్ హాత్నూర్ మండలం గిన్నూర్‌కు చెందిన పాటిల్ జ్యోత్స్న గ్రూప్-1 పరీక్షలో విజయవంతంగా ఎంపీడీవో (MPDO)గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వారు జిల్లా కలెక్టర్ రాజర్షి షా గారిని మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించి, రాష్ట్ర సేవలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తో కలిసి వీరిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. గ్రూప్-1లో ఎంపిక కావడం ద్వారా తుడుం లవకుమార్, పాటిల్ జ్యోత్స్న తమ కుటుంబాలకు గర్వకారణంగా నిలిచారు. వీరి విజయాలు ఇతర aspirantsకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. వీరితో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచెద్దాం.... మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి




స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు మనదే మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, పిలుపు

నిర్మల్ జిల్లా ముధోల్ సెప్టెంబర్ 30 అమృత్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళదాం.. పొలం బాట అనే పథకం ద్వారా గ్రామాల్లోని రైతులు చేనులకు వెళ్లే రోడ్ల కోసం సుమారు 2 కోట్ల 60 లక్షల రూపాయలు గత వారం రోజుల క్రితం మంజూరు అయినవి. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కు ముధోల్ నియోజకవర్గం ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన జువ్వాడి కృష్ణారావు



మల్లాపూర్ అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 30 మల్లాపూర్ మండలకేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్య కర్తల సమావేశం జరిగింది .ఈసమావేశంలో జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం ఏర్పడినప్పటి నుండి ప్రజలకు అందుబాటులో ఉండి పథకాలై తేనేమి ,అభివృద్ధి విషయంలో కానీ ఒక్కొక్కటిగా చేసుకుంటూ ముందుకెళ్తోంది అని ,చేసిన పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మల్లాపూర్ మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ ,సర్పంచ్ అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేయాలని జగిత్యాల మొదటి జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకోవాలనికార్య కర్తలనుద్దేశించి మాట్లాడారు ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ హోదా కలిగిన నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు

# "డిజిటల్ గ్రామాలు" లక్ష్యంగా ఆదిలాబాద్ కలెక్టర్ తో కలిసి స్వశోధన్ ట్రస్ట్ నిర్వాహకులు మంగళవారం క్యాంప్ కార్యాలయం లో సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ జిల్లా లో గ్రామీణ అభివృద్ధిని లక్ష్యంగా తీసుకున్న స్వశోధన్ ట్రస్ట్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా సహకారంతో "డిజిటల్ గ్రామాలు" ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోందని ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం స్వయం సమృద్ధి సాధించడం, గ్రామాలలో పట్టణ సౌకర్యాలను అందించడం, పట్టణ వలసలను నిరోధించడం.

ప్రధాన అంశాలు:

డిజిటల్ విద్య:

గ్రామీణ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు ద్వారా విద్యారంగంలో ఆధునికీకరణ. DEEO, విద్యాశాఖ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ పురోగతిపై ప్రత్యేక నివేదికలు రూపొందించబడ్డాయి. ICT కేంద్రాల నవీకరణ: పాఠశాలల్లోని ICT కేంద్రాలు (ఇన్ఫర్మేషన్ / కమ్యూనికేషన్ టెక్నాలజీ) స్వశోధన్ ట్రస్ట్ సహకారంతో అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి యువత ,మహిళల సాధికారత కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేయబడుతున్నాయని అన్నారు.

డిజిటల్ క్లినిక్‌లు:

గ్రామీణ ఆరోగ్య పరిరక్షణకు భాగంగా నార్నూర్ గ్రామంలో బుధవారం నాడు కొత్త డిజిటల్ క్లినిక్ ప్రారంభించడం జరుగుతుందని కార్డియాలిస్ట్ కరుణాకర్ తెలిపారు. ఈ క్లినిక్ ద్వారా గ్రామస్థులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు డిజిటల్ విధానంలో అందించబడతాయని

"డిజిటల్ గ్రామాలు" పథకం ద్వారా గ్రామీణ జీవనశైలిని ఆధునీకరించి, స్వయం సమృద్ధిగల గ్రామాల నిర్మాణం. ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామాలు ఆర్థిక, విద్య, ఆరోగ్య పరంగా ముందడుగు వేయనున్నాయని అందుకు అందరి సమిష్టి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో dmho నరేందర్ రాథోడ్, dwo, రాహుల్, స్టేట్ అధికారులు, తదితరులు ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన బోస్లే నారాయణరావు పాటిల్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

నిర్మల్ జిల్లా భైంసా టౌన్ సెప్టెంబర్ 30 అమృత్ తెలంగాణ భైంసా పట్టణం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముధోల్ నియోజకవర్గం లోని ఏడు మండలాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ 18 చెక్కులను దాదాపు ఆరు లక్షల రూపాయల చెక్కులను బాధితులకు పంపిణీ చేసిన ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే భోస్లె నారాయణరావు పటేల్, వారితో పాటు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, రామచంద్ర రెడ్డి, కుబిర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బసీరుద్దీన్, తనూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుండ్లిక్, ముధోల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, నర్సాపూర్ జి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతిలాల్ పటేల్, ఖలీమ్, సీనియర్ నాయకులు బంక బాబు, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ పాల్గొన్నారు

# ఎన్నికల కోడ్ నియావళి పాటించాలి జగిత్యాల జిల్లా కలెక్టర్ :సత్యప్రసాద్



జగిత్యాల అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 30 స్థానిక ఎన్నికల కోడ్ నియమావళి పాటించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సోమవారం నుండి ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున, రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ వ్రాతలను వెంటనే తొలగించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలోఅదనపు కలెక్టర్ బిరాజాగౌడ్,జడ్పీ సీఈఓ గౌతంరెడ్డి కూడా పాల్గొన్నారు.

# జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణకు అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ అధికారి ఎలక్షన్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఎన్నిలక కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎటువంటి రాజకీయ ఫ్లెక్సీలు, వాల్ పెయింటింగ్స్ ఉండకూడదని అన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు అధికారుల అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలను అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద ఇప్పటికే చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, అధికారులు ఎప్పటికప్పుడు చెక్ పోస్టులను తనికి చేస్తూ ఉండాలని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు ఎఫ్ఎస్టి, వివిఎస్టి, ఎస్ఎస్టీ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వివరించారు. రూట్ అధికారులు పోలింగ్ కేంద్రాలకు ముందుగానే వెళ్లి, ఆయా మార్గాల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో చూడాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు విస్తృత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, సిపిఓ జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలి

కుభీర్ :అమృత్ తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్తలు, నాయకులు కష్టపడి పని చేయాలని ఆ పార్టీ నాయకుడు కిరణ్ కొమ్రెవార్ అన్నారు. మంగళవారం కుభీర్ లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కొమ్రెవార్ మాట్లాడుతూ.. జడ్పిటిసి, ఎంపీటీసీ ఎలక్షన్లలో దీటైన అభ్యర్థులను ఎంపిక చేసి వారి గెలుపు కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆరు గ్యారంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలోవ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రేకులు గంగ చరణ్, నాయకులు లోలం శ్యాంసుందర్,మండల బిఆర్ ఎస్ అధ్యక్షులు ఎన్నిల అనిల్, మాజీ వైస్ ఎంపీపీ మొహీనుద్దీన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనాదిగా వస్తున్న దసరా ఉత్సవాలను ఈ ఏడాది సైతం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాయల్ శంకర్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అనాదిగా వస్తున్న దసరా ఉత్సవాలను ఈ ఏడాది సైతం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు హిందూ నమాజ్ ఉత్సవ్ సమితి ఆధ్వర్యంలో ఆదిలాబాద్ లోని దసరా మైదానంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు మఠాధిపతి యోగానంద్ సరస్వతి గారితో కలిసి మంగళవారం భూమి పూజ చేశారు. చెడుపై విజయం సాధించినందుకు జరుపుకునే గొప్ప పండుగ దసరా అని అన్నారు. ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.. ఉత్సవ సమితి అధ్యక్షులు హనుమాన్లు నాయకులు రాళ్ల బండి మహేందర్ బిజెపి నాయకులు భరత్ కృష్ణ యాదవ్ జ్యోతి రెడ్డి సూర్య కిరణ్ దాము రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# నేటి నుండి ఎలక్షన్ కోడ్ అమలు

**అధిక మొత్తంలో డబ్బు మద్యం తీసుకెళ్లరాదు**

**సరైన ఆధార పత్రాలు లేకుంటే సీజ్ చేస్తాం :ఎస్సై అనిల్**







ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 30 స్థానిక సంస్థల ఎన్నికల ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినందున ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గండి హనుమాన్ చెక్ పోస్ట్ వద్ద ఈరోజు నుండి ఇబ్రహీంపట్నం పోలీస్ వారి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు ప్రారంభించనైనది. ఎలాంటి ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో డబ్బులతో గానీ మద్యం తో గానీ రవాణా చేసినట్లయితే అట్టి డబ్బులు లేదా మద్యాన్ని సీజ్ చేయబడుతుంది అని ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ గారు సూచించారు.

# బజరంగ్దళ్ సేన ఆధ్వర్యంలో అమ్మవారి పల్లకిసేవ

## అమ్మవారు దుర్గామాతగా దర్శనం ...ప్రత్యేక పుజలు నిర్వహించిన భక్తులు





జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బజరంగ్దళ్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో మంగళవారం భక్తులకు అమ్మవారు దుర్గ మాత గా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భవాని దీక్ష పరులు ,భక్తులు అమ్మవారికి వివిధ రకాల అలంకరణ చేసి అర్చకుల సహకారంతో పంచామృత అభిషేకాలు, అష్టోత్తరాలు తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు కప్పగంటి మహేష్ శర్మ నిర్వహించారు. పంచహారతులు, నక్షత్ర హారతులను భక్తులు స్వీకరించారు. అమ్మవారి పల్లకిసేవ గ్రామ పురవీధుల్లో జరిగింది. మండపంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ ధళ్ సేన అధ్యక్షుడు సున్నం రాజేష్,ఉపాధ్యక్షుడు పుప్పాల మహేష్, కోశాధికారి మగ్గిడి రవి,సలహదారు రెడ్డవేన అజయ్ కుమార్,కార్యనిర్వాహకుడు చాట్ల నిలయ్,సోషల్ మీడియా ఇంచార్జి గోల్లపెల్లి రాజవిక్రంత భవాని దీక్ష స్వాములు,భక్తులు, మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భూ అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి పేదల భూమీ కబ్జా ప్రయత్నం - అట్రాసిటీ కేసులో నిందితుడి అరెస్ట్, రిమాండ్ ఇదివరకే పలు కేసులలో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి రౌడీయిజం చేసే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు, ప్రజలకు న్యాయం చేసే దాకా పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందని హామీ. నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ, పేద ప్రజల భూములను కబ్జా చేయాలనుకున్న వారిపై కఠిన చర్యలు ఫోర్జరీ, దౌర్జన్యం, చీటింగ్ కేసులలో ప్రజలు నిర్భయంగా పోలీసు వ్యవస్థని సంప్రదించవచ్చు. ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి. మంగళవారం స్థానిక ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి ఒక పాత్రికా ప్రకటన విడుదల చేస్తూ వివరాలను వెల్లడించారు, ఆదిలాబాద్ లో ఎలాంటి ఫోర్జరీలకు, భూ అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై, ప్రభుత్వ ప్రైవేటు భూములను ఆక్రమించే ప్రయత్నం చేసే వారి పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న దళితుల భూస్వాధీన ప్రయత్నం , ప్రాణహానీ, బెదిరింపులు కేసులో నిందితుడు ఉష్కం రాఘుపతి వయసు: 41 ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని 29.09.2025 సాయంత్రం 5:20 గంటలకు ఆదిలాబాద్ లో అరెస్టు చేయడం జరిగిందని, తదుపరి న్యాయమూర్తి ఆదేశాల మేరకు జ్యూడిషల్ రిమాండ్ కు తరలించడం జరిగింది అని తెలిపారు.

కేసు వివరాలు

ఈ కేసు మావల పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 254/2025 గా నమోదు చేయబడింది. ఫిర్యాదు దారుడు ఎరే నదిపి గంగన్న (వయసు: 53, వృత్తి: రైతు, కులం: ఎస్సీ, నివాసం: మావల) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయింది. 2025 జూన్ 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో మావల గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో ఈ ఘటన జరిగింది.

నేర వివరాలు

బాధితులు ( గంగన్న, ఎరే లక్ష్మి) అసైన్డ్ పట్టా భూములను ఆరు సంవత్సరాల క్రితం (2019) రాఘుపతికి తాకట్టు పెట్టి ఒక్కొక్కరికి రూ.18 లక్షలు పొందారు. భూములను తిరిగి సాగు చేసుకోవడానికి, అప్పు తీర్చడానికి వచ్చినప్పుడు నిందితుడు కొంత మందితో కలిసి అక్కడికి చేరుకొని వారిని ప్రాణహానీకి గురి చేస్తూ, ట్రాక్టర్ తో తొక్కిస్తానని బెదిరించి, భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసాడు.

నమోదైన సెక్షన్స్ BNS 2023 సెక్షన్లు: 308(5), 351(2) r/w 3(5)

ఎస్సీ/ఎస్టీ చట్టం 2015 సవరణ ప్రకారం: సెక్షన్లు 3(1)(r)(s)(g), 3(2)(va), 3(2)(v)

నిందితుడు రాఘుపతిపై ఇప్పటికే మావల పీఎస్ లో రౌడీషీటు ఉంది. ఇతను పలు కేసులలో నిందితుడుగా ఉన్నట్లు తెలిపారు. బాధితులకు న్యాయం చేయడం, చట్టం-శాంతి భద్రతను కాపాడడం కోసం పోలీసులు కట్టుబడి ఉన్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మావల సీఐ కర్ర స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిస్పక్షపాతంగా ఎన్నికలు విధులు నిర్వర్తించాలి



రాజన్న సిరిసిల్ల : అమృత్ తెలంగాణ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు నిస్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ హరిత ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్( ఎంసీసీ)పై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిత హాజరై మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. విధుల్లో భాగంగా ఎఫ్ఎస్, ఎస్ఎస్టీ లు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్షం ప్రదర్శించవద్దని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడంపై వివరించారు. ఆయా మండలాల నోడల్ ఆఫీసర్లు తమ నివేదికను ప్రతి రోజు పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంసీసీ నోడల్ ఆఫీసర్ గా డీఆర్డీఓ శేషాద్రి నియమించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఉంటాయని తెలిపారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ షర్ఫుద్దీన్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన BSP బోథ్ ఎమ్మెల్యేకు పోటీ చేసిన అభ్యర్థి మెస్రం జంగుబాపు

## పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎంపీ సోయం బాపురావు రావు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపురావు గారి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన BSP పార్టీ నుండి బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేసిన మెస్రం జంగుబాపు ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించిన ఆదిలాబాద్ మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ్ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్. ఈ సందర్భంగా మెస్రం జంగుబాపు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు పాటుపడుతున్నాని ఆయన అన్నారు. మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ ఖచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం అని ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ పీఠం కైవసం చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,విచర్ విభాగ్ తెలంగాణ కోఆర్డినేటర్ తులా అరుణ్, ఇచ్చోడ మార్కెట్ కమిటీ చేర్మెన్ కుమురం కోటేష్, జాలికే పాండురంగ, లింగ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అమెరికా, సింగపూర్‌లో వైభవంగా బతుకమ్మ సంబరాలు



వేములవాడ అమృత్ తెలంగాణ: ప్రవాస భారతీయుల ఆధ్వర్యంలో అమెరికా, సింగపూర్ మహానగరాలు తెలంగాణ సంస్కృతితో ముస్తాబయ్యాయి. వేములవాడ ప్రాంతానికి చెందిన ఎన్నారైలు తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానికులు, విదేశీయులు, ప్రవాసులు సమష్టిగా పాల్గొని వేడుకలను మరింత విశేషంగా మార్చారు.

అమెరికా ఆస్టిన్‌లో ఉత్సవాలు

ఆస్టిన్ హిందూ టెంపుల్ కమ్యూనిటీ పార్క్‌లో మహిళలు, చిన్నారులు, యువతులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ చుట్టూ ఆటపాటలతో సందడి చేశారు. డిజే సప్పులు, బ్యాండ్ బాజాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమెరికా వాసులు కూడా భారతీయుల వెంట నిలిచి సాంప్రదాయ వేషధారణలో బతుకమ్మలో పాల్గొనడం విశేషం. “ఎన్నారైలతో పాటు స్థానికులు కూడ కలిసిన ఈ సంబరాలు చరిత్రాత్మకంగా నిలిచాయి” అని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సింగపూర్‌లో అంబరాన్నంటిన వేడుకలు

సింగపూర్ సంబవాంగ్ పార్క్‌లో 3,000 మందికి పైగా ప్రవాసులు బతుకమ్మ ఆడారు. ఆడపడుచులు అలంకరించిన బతుకమ్మలకు రెడ్ కార్పెట్ స్వాగతం పలికారు. పాల్గొనేవారికి ప్రత్యేక బహుమతులు, పురస్కారాలు అందజేశారు. దాతలను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. “దశాబ్దంగా సింగపూర్‌లో బతుకమ్మకు విశేష ఆదరణ లభిస్తోంది. ఇది తెలంగాణ సంస్కృతి ఘనతను చాటిచెబుతోంది” అని సొసైటీ సభ్యులు తెలిపారు. అమెరికా, సింగపూర్‌లలో జరిగిన ఈ ఉత్సవాలు ప్రవాస భారతీయులకే కాకుండా స్థానికులకు కూడా తెలంగాణ సంప్రదాయాల వైభవాన్ని పరిచయం చేశాయి.

# సాకినాకలో సద్దుల బతుకమ్మ..



వేములవాడ అమృత్ తెలంగాణ: రూరల్ వేములవాడ నియోజకవర్గానికి చెందిన వారు బొంబాయిలో స్థిరపడి ఉన్నా, తమ సంస్కృతి సంప్రదాయాలను మరువకుండా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం ముంబాయిలోని సాకినాక పోచమ్మగుడి వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. మహిళామణులు, ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మను అందంగా అలంకరించి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. “గౌరమ్మతో ఇచ్చుకో అమ్మ వాయనం - పుచ్చుకో అమ్మ వాయనం” అంటూ సాంప్రదాయ వాయనములు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. పిండి వంటలతో సిద్ధం చేసిన పదార్థాలను ఒకరికొకరు పంచుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ రాత్రి భోజన సదుపాయం కల్పించారు. ఈ వేడుక విజయవంతంగా జరగడానికి సహకరించిన సాకినాక పోలీసులకు గుడి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో ఎన్నం పరుశురాము, వావిలాల రాములు, గజ్జెల్లి రాజు, రాపల్లి సతీష్, కొంక లక్ష్మణ్, ఎన్నం రమేష్, చింతకింద నరేష్, గుజ్జ శ్రీకాంత్, శ్రీ గాది రాజేందర్, గాలి పెల్లి మల్లేశం, వాసాల కైలాసం, బిట్ల కన్నయ్య, ముగ్గలము మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. మహిళల్లో బిట్ల ప్రమీల, గుజ్జ హైమావతి, గాజుల జ్యోతి, గాజుల సంధ్య, గాలి పెల్లి లావణ్య, శ్రీ గాది లక్ష్మి, శ్రీ గాది సుకన్య, శ్రీ గాది స్వాతి, కొంక లక్ష్మి, మ్యాన పూజిత, రాజుల సరిత, ఎముజీల లావణ్య, రాపెల్లి రాజేశ్వరి, పడాల కవిత, కుందెన ఉమా, లగిశెట్టి రజిత, చింతకింది రాజేశ్వరి, ఇంజమూరి అమృత, గాజేల్లి జ్యోతి, గాజేల్లి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# సంత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రం..

## పెద్ద ఎత్తున మండల ప్రజలు పాల్గొనాలని సమతా సుదర్శన్ పిలుపు.....




నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి సెప్టెంబర్ 30 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి ఎల్.వి.ప్రసాద్ యూనిట్ను సమత సుదర్శన్ కంటి పరీక్ష కేంద్రంగాలి సమత ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా నర్సాపూర్ జి మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం జాతీయస్థాయిలో లక్షలాది మందికి కంటిచూపు ప్రదాతగా పేద ప్రజలకు కంటి చూపు వైద్యాన్ని అందిస్తున్న ఎల్ వి ప్రసాద్ హాస్పిటల్ యాజమాన్యా వారు చేస్తున్న సేవా కార్యక్రమాల కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం నర్సాపూర్ మండలంలో కంటి పరీక్ష కేంద్రానికి సమత ఫౌండేషన్ సహాయం కోరడం సంతోషంగా భావించి కంటి పరీక్ష యూనిట్ కోసం సహకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నర్సాపూర్ యూనిట్ను సమతపాల్గొనాలని కోరారు సుదర్శన్ కంటి పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేయడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు

# సానుభూతి'కి చాన్స్ లేదిక.!



మల్హార్ రావు: :అమృత్ తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది. గతానికి భిన్నంగా రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆశావహులు ఒక్కసారిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

గతానికి భిన్నంగా..

గతంలో ముందుగా ఒక్క నోటిఫికేషన్ జారీ అయ్యేది. అయితే ఎంపీటీసీ ఎన్నికలు, లేదా సర్పం చ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో ఏదో ఒక్కటి ముందు జరిగేవి. ఇలా జరగడం మూలంగా ముందుగా వచ్చిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆ ఎన్నికల్లో మంచి ఓట్లు సాధించి, దరి దాపుల్లోకి వచ్చి ఓడి పోయినవారు..మరోసారి వెంటనే వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే అవకాశం ఉండేది. కానీ ఈ సారి సానుభూతి' చాన్స్ లేకుండానే నేరుగా ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫలితంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు సానుభూతిని మూటగట్టుకునే చాన్స్ లేకుండా పోయింది. రెండు ఎన్నికల్లో పోటీ చేసి అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రెండింటికీ పోటీ చేస్తే..నెగెటివ్ ఫలితాలు వస్తాయని కొందరు భావిస్తున్నారు. మొదటి ఎన్నికల్లో ఓడి.. రెండో ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఈ సారి లేవు. గతంలో చాలా మంది అభ్యర్థులు సర్పంచ్ పదవికి ఓడి పోయి, మళ్లీ ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిచారు. ముందుగా ఎంపీటీసీగా ఓడిపోయి, తర్వాత సర్పంచ్ గా గెలిచిన ఘటనలు ఉన్నాయి. ఈ సారి ఆ అవకాశం లేకుండా పోయింది. ఏది ఏమైనా ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి.

పార్టీ నేతలకు తలపోట్లు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ పరంగా జరుగుతుండగా.. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పార్టీ రహితంగా సాగుతాయి. ఈ నేపథ్యంలో ఒకే సారి అటు ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను ఆయా పార్టీ నేతలు ఎంపిక చేయాల్సి వస్తుంది. రెండు వేర్వేరుగా నోటిఫికేషన్లు వస్తే..ఆయా పార్టీలకు కొంత సమయం దొరికి అభ్యర్థుల ఎంపిక సులభంగా ఉండేది. కానీ, ఇప్పుడు ఏకకాలంలో ఎన్నికలు రావడంతో ఒక్క ఊరిలో ఎంపీటీసీ అభ్యర్థిని, సర్పంచ్ అభ్యర్థిని, మండల స్థాయిలో జెడ్పీటీసీ అభ్యర్థిని, మళ్లీ గ్రామస్థాయిలో వార్డు సభ్యులను ప్యానల్గా నిలపాల్సిన పరిస్థితి నెలకొంది.

# వ్యవసాయ ఉత్పత్తులపై ఋణాల పథకాలు..

భువనగిరి కలెక్టరేట్ / బొమ్మలరామారం :అమృత్ తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోగల ధర్మారెడ్డిగూడెం గ్రామంలో " వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయు గిడ్డంగులు, నిల్వ దాన్యం పై ఋణాలు" అనే అంశం పైన అవగాహన కార్యక్రమాన్ని జాతీయ మొక్కల ఆరోగ్య యజమానియా సంస్థ రాజేంద్రనగర్ – రైతు విజ్ఞాన కేంద్రం యాదాద్రి భువనగిరి జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ హైదరాబాద్ సహాయ సంచాలకులు డా. వి జ్యోతి మాట్లాడుతూ గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యవసాయ ఉత్పత్తుల పై ఋణాల పథకాలను వివరించారు.



వేర్ హౌసింగ్ డెవలప్మెంట్ మరియు రెగ్యులేటరీ అథారిటీ, ఎలక్ట్రానిక్ నెగోటియాల్టీ ఆఫ్ వేర్ హౌస్ రిసిప్ట్ – గిడ్డంగి రసీదు చర్చల సామర్థ్యం) అంశాలను వివరించారు . మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేనప్పుడు, గిడ్డంగుల్లో నిల్వ చేసుకొని 8 నుంచి 9 శాతం వడ్డీతో ఋణం పొందవచ్చునారు. ఇతరులకు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మినపుడు, ఋణం కూడ ఇతరులకు బదిలీ కాబడుతుందన్నారు. గ్రామంలోని గిడ్డంగులను వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు వాడి లబ్ధి పొందాలన్నారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.అనిల్ కుమార్ ధాన్యం నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి, ప్రత్తి సాగులో అధిక దిగుబడికి పాటించవలసిన మెలకువలను తెలియజేసారు. మైలారం గ్రామంలోని గిడ్డంగులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు రాజేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, బాల్ రెడ్డి, దేవా రెడ్డి, చంద్రా రెడ్డి, కంచి మల్లయ్య , మహిళా రైతులు పాల్గొన్నారు.

# బీర్లగొంది గ్రామాన్ని సందర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్





అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ చిన్నారులతో ఎమ్మెల్యే ఫోటో బోథ్ మండలంలోని బీర్లగొంది గ్రామాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. గ్రామస్తులు తమ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గ్రామానికి విచ్చేసిన సందర్భంగా పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దుర్గమాతను దర్శించుకొని బోగ్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని తప్పకుండా గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. వీరి వెంట మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం..

చండూరు : అమృత్ తెలంగాణ: ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం అని గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అరుణ దంపతులు తెలిపారు. మంగళవారం స్థానిక గాంధీజీ విద్యాసంస్థల్లో 22వ నెల నిత్యావసర సరుకులను పేదలకు పంపిణీ చేసి మాట్లాడారు. మా జీవితం ఉన్నంతవరకు గాంధీజీ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ.. సమాజంలో ఆదర్శవంతంగా జీవిస్తామని, ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయమని అన్నారు. గాంధీజీ ఫౌండేషన్ పేదల పక్షపాతి అని, ప్రాణం ఉన్నంతవరకు నిరుపేదలకు సేవ చేస్తూనే ఉంటామని అన్నారు. పేదలకు సేవ చేయడంలో ఉన్న ఆనందం మరి ఎక్కడ లభించదని అన్నారు. మా గాంధీజీ విద్యాసంస్థల ద్వారా తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు చాలా తక్కువ ఫీజులతో విద్యనందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, కోడి ప్రీతి, కోడి



శృతి, బోడ యాదయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్,గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు



ఉప్పునుంతల :అమృత్ తెలంగాణ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డాక్టర్ స్వప్న మాట్లాడుతూ.. "బతుకమ్మ పండుగ మన తెలంగాణ మహిళల ఆత్మీయ పండుగ. ఇది మన సంప్రదాయాలకే కాదు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక" అని పేర్కొన్నారు. మహిళా సిబ్బంది పూలతో బతుకమ్మను అలంకరించి, కేంద్రం ఆవరణలో ఆడుతూపాడుతూ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ స్వప్న, ఎంపీహెచ్వో మధు నాయక్, నర్సింగ్ ఆఫీసర్ ఉఫత్, సూపర్వైజర్ ప్రభావతి, ఫార్మసీ ఆఫీసర్ కుమారాచారి, ఎంఎల్ఎచ్పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


# వ్వాట్ డేనియల్ లవర్ ఇంతందంగానా?



2021లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్లాక్ బస్టర్ హిట్ 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్ లో అడుగుపెట్టింది సంయుక్త మీనన్. ఇందులో ఆమె రానా దగ్గుబాటి సరసన కథానాయికగా నటించింది. అందానికి అందం నటప్రతిభ ఉన్న నాయికగా పేరు తెచ్చుకుంది. డేనియల్ (రానా) వైఫ్ పాత్రలో డైనమిక్ నటనకు ప్రశంసలు అందుకుంది. 2022లో పృథ్వీరాజ్ 'కడువ'తో బ్లాక్ బస్టర్ ని అందుకుంది. ఇప్పుడు ధనుష్ ద్విభాషా చిత్రం వాతి .. కళ్యాణ్ రామ్ పాన్ ఇండియా మూవీ 'బింబిసార'.. కన్నడలో గాలిపాట 2 చిత్రాల్లో నటిస్తోంది. కెరీర్ పరంగా క్షణం తీరిక లేనంత బిజీ అయిపోయింది సంయుక్త. 2016లో పాప్ కార్న్ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన సంయుక్త సూపర్ హిట్ చిత్రం 'తీవండి'లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2021లో వెల్లం-ఆనుమ్ పెన్నుమ్ చిత్రాలతో నెమ్మదిగా నిలదొక్కుకుంది. సంయుక్త కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ ఉత్తమ నటి అవార్డును అందుకుంది. భీమ్లా నాయక్ – కడువ లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు తనని గోల్డెన్ లెగ్ గా మార్చాయనడంలో సందేహం లేదు. సంయుక్తకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇక ఇదే అదనుగా ఈ బ్యూటీ కూడా సోషల్ మీడియాల్లో వరుస ఫోటోషూట్లతో అదరగొడుతోంది.

# కేతిక రాంగ్ టైమ్ లో అడుగుపెట్టిందా?

కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. పూరీ జగన్నాథ్ కొడుకు పూరీ ఆకాష్ హీరోగా నటించిన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కేతిక శర్మ ఆ సినిమా డిజాస్టర్ గా నిలవడంతో పెద్దగా హైప్ తెచ్చుకోలేకపోయింది. కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. ఇవన్నీ చూస్తుంటే కేతిక ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన టైమ్ కరెక్ట్ కాదనిపిస్తోంది. నాలుగేళ్లుగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఒక్కటి కూడా సక్సెస్ ఇవ్వకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఆఖరికి కేతిక రీసెంట్ గా రాబిన్హుడ్ సినిమాలో చేసిన ఐటెమ్ సాంగ్ కూడా ఆమెకు కోరుకున్న సక్సెస్ ను ఇచ్చి, తన కెరీర్ కు బ్రేక్ ఇవ్వలేకపోయింది. రొమాంటిక్ సినిమా తర్వాత కేతిక, నాగశౌర్యతో కలిసి చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్ తో కలిసి చేసిన రంగ రంగ వైభవంగా కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లుగా నిలిచాయి. దీంతో తన ఆశలన్నీ ఆమె కెరీర్లోనే నటించిన బిగ్గెస్ట్



ప్రాజెక్ట్ అయిన బ్రో సినిమాపై పెట్టుకుంటే ఆ సినిమా కూడా తన ఆశలపై నీళ్లు చల్లుతూ బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. బ్రో సినిమా తర్వాత టాలీవుడ్ దర్శకనిర్మాతలు కేతికను పట్టించుకోవడం మానేశారు. హీరోయిన్ గా పాత్రలు తగ్గిపోవడంతో కేతిక రాబిన్హుడ్ లో ఐటెమ్ సాంగ్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆ సాంగ్ చేసింది. ఆ సాంగ్ లోని కేతిక బోల్డ్ మూవ్స్ సోషల్ మీడియాలో కాంట్రవర్సీ అయినప్పటికీ, ఆ సెన్సేషనల్ సాంగ్ కూడా అమ్మడి కెరీర్ కు ఏ మాత్రం ఉపయోగపడలేకపోయింది.

# ఇస్మార్ట్ బ్యూటీ సినిమా కష్టాలు..!

నన్ను దోచుకుందువటే సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. హీరోయిన్ గా మొదటి సినిమాతోనే మంచి మార్కులు దక్కించుకుంది. సుధీర్ బాబు కు జోడీగా ఆ సినిమా లో నటించిన నభా నటిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడం తో పాటు పెద్దల యొక్క చూపు పడేలా చేసింది. ఆ సినిమా తర్వాత బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చాయి. అనూహ్యంగా నభా నటేష్ యొక్క ప్రతిభ గుర్తించిన డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ ఏకంగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ ఇచ్చాడు. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడం మాత్రమే కాకుండా ఇస్మార్ట్ పోరీగా నభా నటించిన తీరు అందరిని ఆకట్టుకుంది. హీరోయిన్ గా ఆ సినిమా తో కమర్షియల్ హీరోయిన్ గా ఈ అమ్మడు నిలదొక్కు కోవడం ఖాయం అనుకుంటూ ఉండగా అనూహ్యంగా ఈ అమ్మడి కెరీర్ కు కరోనా కష్టం వచ్చి పడింది. వరుసగా సినిమాల్లో ఆఫర్లు వస్తాయని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా కరోనా వల్ల మొత్తం సీన్ రివర్స్ అయ్యింది. కాస్త గ్యాప్ రావడంతో ఈ అమ్మడిని జనాలు మాత్రమే కాకుండా సినీ వర్గాల వారు కూడా పక్కన పెట్టేసినట్లుగా ఉన్నారు. అందుకే ఈమధ్య కాలంలో ఈ అమ్మడు కనీసం ఒక్కటి రెండు చిన్నా చితకా ఆఫర్లను కూడా దక్కించుకోలేక పోతుంది అల్లుడు అదుర్స్ మరియు మాస్ట్రో సినిమాల్లో నటించిన ఈ అమ్మడు కమర్షియల్ గా మళ్లీ బ్రేక్ ను దక్కించుకోలేక పోయింది



# అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఈ లుక్ కోసం 10ఏళ్లు శ్రమించిన సింగర్



ఇటీవలి కాలంలో గాయనీగాయకులు కూడా ఫిట్ నెస్ ఫ్రీక్ లు గా మారుతున్నారు. అందాల కథానాయికలకు ధీటుగా తమదైన గ్లామర్ తో ఓలలాడిస్తున్నారు. హీరోయిన్లతో పోలిస్తే టూ హాట్ గా కనిపించే గాయనీమణులకు కొదవేమీ లేదు. ఇక పాప్ గాయనిగా పాపులరైన నేహాభాసిన్ పరిచయం అవసరం లేదు. జగ్ ఘూమేయా (సుల్తాన్) .. ధుంకీ (మేరే బ్రదర్ కి దుల్హాన్).. పర్వా వంటి చార్ట్ బస్టర్ సాంగ్స్ పాడిన గాయనిగా తనకంటూ ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంది. బ్యాండ్ మేనేజ్ మెంట్ సమయంలో తన ఫ్యాటీ స్టమక్ ని చూస్తూ చాలా సిగ్గుపడేదానిని అని నేహా ఇప్పుడు మరోసారి గుర్తుచేసుకుంది. అందాన్ని కాపాడుకునేందుకు గాయణీమనులు కూడా చాలా చేయాలి. నిరంతరం జిమ్ యోగా అంటూ పెద్ద షెడ్యూల్ ని క్రమం తప్పకుండా పాటించాలి. అప్పుడు మాత్రమే టోన్డ్ ఫిజిక్ ని మెయింటెయిన్ చేయగలరు. చాలా ఏళ్లుగా శ్రమించి నేహాభాసిన్ తన రూపాన్ని ఇప్పటికి మార్చుకోగలిగింది. మునుపటిలా బాన పొట్టతో కనిపించడం లేదు. పూర్తిగా టోన్డ్ ఫ్లాట్ స్టమక్ తో కనిపిస్తోంది. ఫిట్ బాడీతో గుబులు పుట్టిస్తోంది. ఇక తాజా ఇంటర్వ్యూలో నేహా కొన్ని సంచలన విషయాలను వెల్లడించింది. సరైన ఆకృతిలో నా పొట్ట లేనందున నేను అంతర్జాతీయ పాప్ స్టార్ ని కాలేనని అనుకునేదానిని అంటూ తన నిరాశ గురించి వెల్లడించింది. ఒకప్పుడు నేహా భాసిన్ పొట్టను చూసి వెక్కిరించేవారట. ఆమె కెరీర్ ప్రారంభ దశలో వెక్కిరింతలు.. అనుచిత వ్యాఖ్యల కారణంగా తాను చాలా మారానని తెలిపింది. బొద్దుతనం వల్ల అనారోగ్యం కూడా వెంటాడేదని వెల్లడించింది. ఇప్పుడు అద్భుతమైన రూపంతో ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది. అంతేకాదు తన శరీరాన్ని ఇలా మార్చుకోవడానికి లేదా మలుచుకోవడానికి ఏకంగా ఆమెకు ఒక దశాబ్దం పట్టిందట. నేను 2002లో %ఎ×వాూ%తో నా కెరీర్ ని ప్రారంభించినప్పుడు ముఖ్యంగా మేనేజ్ మెంట్ లో చాలా బాడీ షేమింగ్ ఎదుర్కొన్నాను. ఆ తరువాత నేను 10 సంవత్సరాలు నా బరువు సమస్యల వల్ల చాలా అనారోగ్యం ఎదుర్కొన్నాను. నా శరీరాన్ని రూపాన్ని అంగీకరించేందుకు నిరంతరం పోరాడాను. నా మనసులో ఇవన్నీ పాతుకుపోయాయి" అని నేహా భాసిన్ చెప్పారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com